క్లుప్తంగా

కళాశాల ఆకస్మిక పరిశీలన



బోధన అంశాలపై ఆరా తీస్తున్న ఆర్ఐఓ దుర్గారావు

టెక్కలి: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని బాలికల జూనియర్ కళాశాలను ఆర్ఐవో పి.దుర్గారావు గురువారం ఆకస్మికంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల బోధన అంశాలపై ఆరా తీశారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు హెచ్ఎం ఎస్.శోభారావు, అధ్యాపకులు రమణ, ఆనందరావు, మోహన్, నాయుడు, శ్రీనివాస్, అప్పలస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వెటర్నరీ అటెండర్ మృతి



సతీష్ (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపల్లి పశు వైద్యశాలలో అటెండర్‌గా పని చేస్తున్న చల్ల సతీష్ (32) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన సమాచారం ప్రకారం సతీష్ బుధవారం విధులకు హాజరై సాయంత్రం స్వగ్రామం సరియాపల్లి చేరుకున్నాడు. రాత్రి తన ఇంట్లో భోజనం చేసి నిద్ర పోయేందుకు ఇటీవల నిర్మించుకున్న కొత్త ఇంటికి వెళ్తుండగా అంతలోనే కరెంటు పోయింది. దీంతో వేగంగా వెళ్లే క్రమంగా ఇంటి ద్వారానికి బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో సతీష్ తల నుంచి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సతీష్‌కు భార్య లక్ష్మణమ్మ, నాలుగేళ్ల కుమార్తె లాస్య ఉన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ నియామకం



కొత్తపేట జంక్షన్‌లో విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్

కోటబొమ్మాళి: కొత్తపేట జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని కోరుతూ సాక్షి దిన పత్రికలో 'అస్తవ్యస్తంగా ట్రాఫిక్' అనే శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కొత్తపేట జంక్షన్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించారు. కొత్తపేట నుంచి రైతు బజార్ వరకూ వాహనాలను క్రమబద్ధీకరించారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు కొంతవరకు తగ్గాయ ని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తామన్నారు.

సాక్షి ఎఫెక్ట్...

చిన్నారిని ఆదుకోండి



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

కవిటి: మండలంలోని నెలవంక గ్రామానికి చెందిన అలిగి కమల ఇటీవల ఆకస్మాత్తుగా మృతి చెందారు. ఆమె భర్తకు మతిస్థిమితం లేదు. దీంతో కమల కుమార్తె దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. చిన్నారి పరిస్థితి తెలుసుకున్న స్పెషల్ గాయ్స్ ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత చదువుల కోసం బాసటగా ఉంటామని ధైర్యం చెప్పారు. అలాగే మరింతమంది దాతలు ముందుకొచ్చి చిన్నారికి అండగా నిలవాలని కోరారు.

బారువ ఆస్పత్రి పరిశీలన

సోంపేట: బారువ, సోంపేట సామాజిక ఆస్పత్రులను డీసీహెచ్ఎస్ అధికారి డాక్టర్ కల్యాణ్ బాబు గురువారం పరిశీలించారు. తుఫాన్ నేపథ్యంలో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆస్పత్రుల్లో ప్రస్తుతం జనరేటర్, ఆక్సిజన్ సిలెండర్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బారువ సామాజిక ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న భవనాలు పరిశీలించారు. ఆయనతో పాటు ఏడీ డాక్టర్ శేషగిరి, జిల్లా నోడల్ అధికారి సంతోష్, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు బాలకృష్ణ, టి.వెంకటేష్, వైద్యులు పి.దుర్యోధన, ఇందుస్మిత తదితరులు ఉన్నారు.

ఏపీటీపీసీ చైర్మన్‌ను కలిసిన జీడిపరిశ్రమదారులు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావును పలాస జీడి పరిశ్రమ యజమానులు గురువారం కలిశారు. పలాసలోని తన స్వగృహం నందు ఇండస్ట్రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరం ఆధ్వర్యంలో పలాస కాష్యూ మ్యానుఫాక్చర్ అసోసియేషన్, పలాస ఇండస్ట్రియల్ ఏరియా సంఘాల తరుపున మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యదర్శి టి.శ్రీనివాసరావు, పీసీఎంఏ ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు, సుధాకర్, శేఖర్ పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న దానా



అక్కుపల్లి తీరంలో కల్లోలంగా కడలి

- ఖరీఫ్ వంటపైనే అన్నదాత ఆశలు
- తుఫాన్ ముప్పుపై ఆందోళన
- అప్రమత్తం చేస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రరూపం దాల్చి దానా తుఫాన్ రూపంలో దూసుకొస్తోంది. దీంతో అన్నదాత గుండెల్లో అలజడి రేగుతోంది. ప్రస్తుతం వరి పంట ఆశాజనకం ఉండడంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో పంట చేతికి అందుతుందనే తరుణంలో, తుఫాన్ వాతావరణం నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పలాస, వజ్రపుకొత్తూరు, మందస, నందిగాం, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట మండలాల్లో సుమారు 95 వేల ఎకరాల్లో పంటసాగు అవుతోంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో పంట పొట్ట దశలో ఉంది.



ఆశాజనకంగా ఉన్న వరిపంట

అధికారుల హెచ్చరికలు

వాతావరణ శాఖాధికారులు గత వారం రోజులుగా హెచ్చరికలు చేస్తున్నారు. అధికారులు సైతం గ్రామ స్థాయిలో ప్రజలు అప్రమత్తం చేస్తున్నారు. అయితే గతంలో జరిగిన పెను విపత్తులు ఇప్పటికీ కళ్లముందు కదల్లాడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. విపత్తుల ప్రభావంతో ఏళ్లుగా నష్టాలను చవిచూస్తున్నామని, వేలాది రూపాయుల పెట్టుబడులు పెట్టి చివరికి అప్పులు మాత్రమే మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఆందోళనలో మత్స్యకారులు

తుఫాన్ నేపథ్యంలో గురువారం కడలి కల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ తీరం వైపు దూసుకొచ్చాయి. అలాగే తీరం వెంబడి చల్లని గాలులు వీచాయి. దీంతో పాటు తేలికపాటి వర్షం కురిసింది. ఇప్పటికే అధికారులు హెచ్చరికలు చేయడంతో మత్స్యకారులు తమ వేట సామాగ్రి, వలలు, తెప్పలను తీరాలను చేర్చి భద్రపరిచారు. అయితే తీరం వెంబటి బలమైన గాలులు వీచే ప్రమాదం ఉన్న నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అప్రమత్తమైన మత్స్యకారులు

ఇచ్ఛాపురం రూరల్: దానా తుఫాన్ హెచ్చరికతో డొంకూరు తీర ప్రాంత మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. గత రెండు రోజులుగా వేటకు వెళ్లని వీరంతా వలలు, నాటు పడవలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాను తీరం దాటనున్న నేపథ్యంలో గురువారం సముద్ర కెరటాలు మోస్తారుగా విరుచుకుపడ్డాయని మత్స్యకారులు తెలిపారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ఉండాలని గంగమ్మను మొక్కుకుంటున్నారు.



సముద్రపు ఒడ్డున నాటు పడవలు



డొంకూరు తీరంలో అల్లకల్లోలంగా ఉన్న సముద్రం



ఇచ్ఛాపురం రూరల్: సురక్షిత ప్రాంతంలో వలలు

అప్రమత్తంగా ఉండాలి

పలాస: దానా తుఫాన్ నేపథ్యంలో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలాస ఎంపీడీవో కె.వసంతకుమార్ సూచించారు. ఈ మేరకు పలాస మండలంలోని లోతట్టు ప్రాంతాలైన అమలకుడియా, పూర్ణభద్ర గ్రామాల్లో గురువారం పర్యటించారు. ప్రజలను కలసి తగిన సూచనలు చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే వరహాల గెడ్డ ఫ్లో ఛానల్, బ్రాహ్మణతర్లా ప్రాంతాన్ని పరిశీలించారు. వరదలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



వరహాల గెడ్డను పరిశీలిస్తున్న ఎంపీడీవో వసంతకుమార్

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

వజ్రపుకొత్తూరు: దానా తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ సీతారామయ్య కోరారు. మండలంలోని మంచినీళ్లపేట, హుకుంపేట, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు, దేవునల్తాడ తదితర తీరప్రాంత గ్రామాల్లో పర్యటించారు. తుఫాన్ పూరీ సమీపంలో తీరం దాటుతున్నందున మన దగ్గర సైతం తీరం కల్లోలంగా మారుతుందన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలన్నారు. ఎలాంటి సహాయం అవసరమైనా కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని సూచించారు. ఆయనతో పాటు వీఆర్వోలు వెంకటరావు, రంగారావు తదితరులు ఉన్నారు.



మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్ సీతారామయ్య

రెండు రోజుల పాటు వర్షాలు



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు

ఇచ్ఛాపురం రూరల్: తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల పాటు వర్షాలు ఉంటాయని తహసీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు. మండలంలో డొంకూరు మత్స్యకార గ్రామంలోని తుఫాన్ రక్షిత భవనంలో వైద్య, గ్రామ సచివాలయ, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా దండోరా వేయాలని సూచించారు. ఎటువంటి అంటువ్యాధులు సోకకుండా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందజేయాలని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ రమ్యారెడ్డికి స్పష్టం చేశారు. అవసరమైతే నిర్వాసితులకు భోజనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ బలివాడ శ్రీహరి, ఆర్ఐ శ్రవణ్‌లు ఉన్నారు.

నదీతీర గ్రామాల్లో పర్యటన

సోంపేట: ప్రజలు, రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి అజయ్ కార్తికేయ, తహసీల్దార్ బి.అప్పలస్వామి సూచించారు. మండలంలోని మహేంద్రతనయ నదీ పరివాహక గ్రామాలు, తీరప్రాంత గ్రామాల్లో గురువారం పర్యటించారు. రైతులు, మత్స్యకారులతో మాట్లాడారు. రైతులు వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని సూచించారు. వారితో పాటు రెవెన్యూ అధికారులు, రైతులు, మత్స్యకారులు తదితరులు ఉన్నారు.



గొల్లగండిలో మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

టెక్కలి రూరల్: టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం దాసరి నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఉప్పాడ ప్రభాస్, చిరంజీవి ప్రధానో అనే ఇద్దరు విద్యార్థులు అండర్–17 విభాగం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 26వ తేదీ నుంచి 28 వరకు తూర్పు గోదావరి జిల్లా మార్టేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పీడీ రామిరెడ్డి, జగ్గమ్మలు అభినందించారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని డొంకూరు ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం జె.సరోజిని తెలిపారు. గురువారం ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 25, 26, 27 తేదీల్లో శ్రీకాళహస్తి వేదికగా జరగబోయే పోటీల్లో బాలికల విభాగం నుంచి వై.భవానీ, డి.మీనా, పి.గీత, బి.ధనలక్ష్మీలు, బాలుర విభాగం నుంచి డి.హేమంత్, డి.రవి, బి.దేవరాజులు జిల్లా తరుపున పాల్గొంటారన్నారు. వీరికి కోచ్‌గా వ్యవహరిస్తున్న వజీర్ అహ్మద్‌కు ఉపాధ్యాయులు శుభాభినందనలు తెలిపారు.



ఇచ్ఛాపురం రూరల్: ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సర్వసభ్య సమావేశం రసాభాస

- ప్రోటోకాల్‌పై అధికారులకు నిలదీత

వజ్రపుకొత్తూరు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో వ్యవసాయ శాఖపై సమీక్ష అనంతరం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. సీసీ రహదారుల పనులకు తాము తీర్మానాలిస్తే తమకు చెప్పకుండా శంకుస్థాపనలు చేసి ప్రోటోకాల్ ఉల్లంఘించడమేంటని నిలదీశారు. గత సమావేశంలో ప్రోటోకాల్ ఉల్లంఘించే అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేస్తే ఎందుకు అమలు చేయలేదని ఎంపీడీవో ఎస్.రమేష్ నాయుడును ప్రశ్నించారు. పాత టెక్కలి దళిత సర్పంచ్ టి.సుశీల మాట్లాడుతూ.. తన కుర్చీని చెత్త బండిలో వేసి ఇంటికి పంపిన పంచాయతీ కార్యదర్శిపై ఏం చర్యలు తీసుకున్నారని, చర్యలు తీసుకోకపోతే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. తాము అభివృద్ధికి అడ్డు కాదని, అయితే సర్పంచ్, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోతే పంచాయతీ తీర్మానాలు సైతం పక్కన పెడతామని ఎంపీపీ స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు తమ్మినేని శ్రావణి, వంక రాజు, మండల విఫ్ తిర్రి గుణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశం జరుగుతున్న దృశ్యం



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ సుశీల

తరగతి గదుల్లోనే భోజనాలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బి.తోటూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఆరుబయట మధ్యాహ్న భోజనాలు చేయడం వలన పడుతున్న ఇబ్బందులపై బుధవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన 'నేలపైనే భోజనాలు' కథనానికి అధికారులు స్పందించారు. గురువారం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కొళిగాం ఉన్నత పాఠశాల హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ మధ్యాహ్న భోజనం పథకం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి ఇకపై నుంచి విద్యార్థులు తరగతి గదుల్లోనే భోజనాలు చేసేలా చూడాలని ఆదేశించారు.

సాక్షి ఎఫెక్ట్...



తరగతి గదిలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

టెక్కలి మండలం చింతలగార గ్రామంలోని విశాఖ డెయిరీ కేంద్రంలో పాలు అమ్ముతున్న పాడి రైతులు



పాడి రైతు దిగాలు..!

- విశాఖ డెయిరీ పాల సేకరణ ధరలు తగ్గింపు
- లబోదిబోమంటున్న పాడి రైతులు
- ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన

టెక్కలి:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాలపై వివిధ రకాలుగా నష్టం పెరుగుతోంది. ఎన్నికల మునుపు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకపోగా, ఇప్పుడు సామాన్య ప్రజలను నష్టపరిచే చర్యలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు అండగా ఉన్న పాడి రైతులను దెబ్బ కొడుతున్నారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా విశాఖ డెయిరీ ద్వారా పాల సేకరణ జరుగుతోంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాల సేకరణ ధరలు ఒక్కసారిగా తగ్గించేశారు. దీంతో పాడి సంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు గగ్గోలు పెడుతున్నారు. లీటరు పాల ధర సుమారు రూ.4ల వరకు తగ్గించేశారు. నిన్నటి వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పాడి రైతులను ప్రోత్సహించే విధంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో విప్లవాత్మక చర్యలు చేపట్టి అండగా నిలిచారు. ఇప్పుడు పాడి రైతులను నష్ట పరిచే విధంగా పాల సేకరణ ధరలు తగ్గిస్తున్నప్పటికీ పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి శాఖా మంత్రి అచ్చెన్నాయుడు కనీసం పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇదంతా హెరిటేజ్ సంస్థకు లాభం కలిగించేందుకు చేస్తున్న ఎత్తుగడ అంటూ పలువురు విమర్శలు చేస్తున్నారు.

నియోజకవర్గం	ప్రతిరోజూ పాల సేకరణ	పాడి రైతులు (సుమారు)
టెక్కలి	17,800	18,800
పలాస	7,735	12,500
ఇచ్ఛాపురం	14,505	15,600



విశాఖ డెయిరీ కేంద్రం ద్వారా పాడి రైతుల నుంచి సేకరించిన పాలు

సుమారు 39 వేల లీటర్ల సేకరణ

టెక్కలి పశు సంవర్ధక శాఖ పరిధిలోని టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో రోజుకు సుమారు 39 వేల లీటర్లకు పైగా పాల సేకరణ జరుగుతోంది. ప్రస్తుతం పాల సేకరణ ధరల తగ్గింపుతో వందలాది మంది పాడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీంతో ఇప్పటికైనా సంబంధిత శాఖా మంత్రి స్పందించి విశాఖ డెయిరీ యాజమాన్యంతో చర్చలు జరిపి పాడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ధరలు తగ్గించేశారు



మాది టెక్కలి మండలం చల్లపేట గ్రామం. విశాఖ డెయిరీకి ప్రతిరోజూ సుమారు రూ.30 లీటర్ల వరకు పాలను అందజేస్తుంటాను. గతంలో లీటరుకు రూ.44లు ఇచ్చేవారు. ఇప్పుడు రూ.36 నుంచి రూ.40లు మాత్రమే వస్తోంది. ఇదే వృత్తిపై ఆధారపడిన మా లాంటి పాడి రైతులకు నష్టం జరుగుతోంది. మరోవైపు దాణా ధరలు తగ్గించలేదు.

– కె.శేఖర్, పాడిరైతు, చల్లపేట, టెక్కలి మండలం



టెక్కలిలో విశాఖ డెయిరీ ప్రధాన కేంద్రం

నష్టపోతున్నాం



మాది టెక్కలి మండలం తిర్లంగి గ్రామం. ప్రతిరోజూ సుమారు 20 లీటర్ల వరకు విశాఖ డెయిరీకు పాలను అందజేస్తుంటాను. ఇంతకు ముందు రూ.41 నుంచి రూ.44ల వరకు లీటరు పాలకు ధర వచ్చేది. ఇప్పుడు రూ.36లు మాత్రమే వస్తోంది. దీంతో ఒక్కో లీటరు దగ్గర దాదాపు రూ.4లు నష్టపోతున్నాం. దీనిపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– బి.రామారావు, పాడి రైతు, తిర్లంగి, టెక్కలి మండలం

సేకరణ ఎక్కువైంది

విశాఖ డెయిరీ ద్వారా పాల సేకరణ అత్యధికం కావడంతో పరిశ్రమలో ప్రాసెస్ కష్టతరంగా మారుతోంది. దీంతో పాల ధరలను తగ్గించేశారు. ధరల తగ్గింపు విషయంలో పాడి రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దు. మరలా ధరలు పెంచుతారు.

– శ్రీరామ్మూర్తి, మేనేజర్, విశాఖ డెయిరీ, టెక్కలి

సంక్షిప్తంగా...

అదనపు కట్నంపై కేసు

కాశీబుగ్గ: రూ.60 లక్షల అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నందుకు కాశీబుగ్గ పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే పలాస సాయినగర్‌కు చెందిన మనీషాకు 2021లో అదే వీధికి చెందిన సుంకర యువరాజుతో వివాహమైంది. కట్నకానుకలు, బంగారం అందించినప్పటికీ అదనంగా రూ.60 లక్షలు తీసుకురమ్మని కుటుంబ సభ్యులతో కలిసి ఒత్తిడి తీసుకురావడంతో బాధితురాలు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువులను రోడ్లపై విడిచిపెట్టొద్దు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని పశువుల యజమానులతో కమిషనర్ నడిపేన రామారావు గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. పశువులను రోడ్లపై విడిచిపెట్టవద్దని సూచించారు. అలా కాని పక్షంలో గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల రక్త నమూనాల సేకరణ

కాశీబుగ్గ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పలాస ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి పర్యవేక్షణలో గురువారం రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ జువాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల రక్త నమూనా పరీక్షలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

కఠినంగా శిక్షించాలి

కాశీబుగ్గ: మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోరు వాసుదేవరావు డిమాండ్ చేశారు. అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులపై చర్యలు తీసుకోవాలని గురువారం ఉదయం కాశీబుగ్గ పోలీసులకు ఏఐవైఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

లీజు పునరుద్ధరించండి

సంతబొమ్మాళి: చిన్న, సన్నకారు ఉప్పు రైతుల ఉప్పు భూముల లీజు హక్కును కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేష్ కోరారు. మండలంలోని శెలగపేట, నౌపడలోని పలువురు ఉప్పు రైతులతో గురువారం మాట్లాడారు. ఉప్పు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. పౌరహక్కుల సంఘం జిల్లా సహాయక కార్యదర్శి యు.సోమనాథ, పిట్ట జోగారావు, తెప్పల ఢిల్లీరావు, పోతనపల్లి వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

కవిటి: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న చింతామణి అమ్మవారి ట్రస్ట్ కవిటి ఉద్దానం ప్రాంతంలో విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు మద్ది జానకిరావు అనే ఇంజినీర్ చదువుతున్న నిరుపేద విద్యార్థికి మూడో విడతగా రూ.40,000 ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. ఈ మొత్తాన్ని విద్యార్థి తల్లి అయిన మీనాకు అందించారు. దీంతో పాటు సారకాసుల హాసిని అనే నిరుపేద విద్యార్థిని తల్లి ప్రభావతికి రూ.20,000లు పెద్దలు, కమిటీ సభ్యుల సమక్షంలో అందించారు.

అధునాతన పద్ధతులతో అధిక దిగుబడులు

వజ్రపుకొత్తూరు రూరల్/వజ్రపుకొత్తూరు: వ్యవసాయంలో అధునాతన పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనుష, డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అనంతగిరిలో గురువారం పలాస డివిజన్ వ్యవసాయ శాఖ ఉపసంచాకుడు ఎల్.వి.మధు అధ్యక్షతన వ్యవసాయంలో అధునిక పద్ధతులు, పంట యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.